నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ రిసాలబజార్, బొల్లారం పీఎస్ కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ ఏడీఈమురళికృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిసాలబజార్, ప్రేమ్‌నగర్, జీఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్, బంజారానగర్, కుటియా మందిర్ అదేవిధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు బొల్లారం మార్కెట్, బొల్లారం పీఎస్, కంటోన్మెంట్ హస్పిటల్ ఏరియా, బొల్లారం బజార్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

రాంగోపాల్‌పేట్: కిమ్స్,జేమ్స్ స్ట్రీట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 3న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సబ్ డివిజన్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం గంట వరకు డీవీకాలనీ, జవహార్‌నగర్ కాలనీ, గార్డెన్ ఏరియా, డీవీ హౌజ్, రామాలయం, కిమ్స్ వెనుక వైపు మధ్యాహ్నం గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వెస్లీ జూనియర్ కాలేజ్, జవహార్‌నగర్, పార్సీ కాంపౌండ్, కరీం కాంపౌండ్, ఎఫ్ క్లాస్ నల్లగుట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సనత్‌నగర్: సంజీవయ్య పార్కు, ఆల్విన్, ఎయిర్‌పోర్ట్, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్, ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంద్రప్రస్థా బిల్డింగ్ స్ట్రీట్‌నెంబర్-1, హుడా లేన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీసు, పాటిగడ్డ రోడ్డు, నవాబ్ గల్లీ, పైగా ప్యాలెస్, రసూల్‌పురా సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..)టమాటా.37, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 61, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 45, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 21, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రైల్వే జోన్ కార్యదర్శిగా శంకర్‌రావు



అడ్డగుట్ట: విశాఖపట్నం కేంద్రంగా నూతనంగా ఏర్పాటు అయిన సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మీశ్రా ఆధ్వర్యంలో శ్రామిక్ యూనియన్ , మజ్దూర్ యూనియన్ పతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఆర్‌ఎఫ్ కోశాధికారిగా, మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్న శంకర్‌రావును నూతన జోన్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం మజ్దూర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మిక నాయకుడు శంకర్‌రావు ఎంపిక హర్షణీయమన్నారు.

అనురాధకు పీహెచ్‌డీ



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్ పేట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మేడ అనురాధ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీహెచ్‌డీ సాధించింది. ఎన్విరాన్‌మెంటల్ న్యూస్ కవరేజ్ ఇన్ సెలెక్టెడ్ ఇంగ్లీష్ డైలీస్ అనే అంశంపై అనురాధకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ కె. నరేందర్ పర్యవేక్షణలో అనురాధ తన పీహెచ్‌డీ పరిశోధన చేసింది. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ ప్రాంతానికి చెందిన అనురాధ ప్రస్తుతం సెయింట్ జోసెఫ్ డీగ్రీ, పీజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

తార్నాక వాటర్ వర్క్స్ మేనేజర్‌గా వినయ్‌కుమార్



లాలాపేట: తార్నాక జలమండలి కార్యాలయం మెనేజర్‌గా వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన మహమ్మద్ ఆసీఫ్ ఆలీ బదిలీపై తుర్కయాంజాల్ వెళ్లాడు. ఈ సందర్భంగా నూతన మేనేజర్ బుధవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు.





రథోత్సవం.. భక్తజనసంద్రం

కోరిన కోర్కెలు తీర్చే బల్కంపేట ఎల్లమ్మ రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. నగరంతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి తెల్లవారుజామునుంచే క్యూ లైన్‌లో నిలుచున్నారు.

– అమీర్‌పేట



హైడ్రా టీమ్.. రెడీ

లష్కర్‌కు చేరిన హైడ్రా బృందాలు

- సహాయక చర్యలకు వాహనాలు సిద్ధం
- అందుబాటులో సుశిక్షితులైన రక్షణ సిబ్బంది
- సమన్వయకర్తలుగా ఇంజినీరింగ్ అధికారులు



అత్యవసర వాహనాల్లోని పనిముట్లు

సికింద్రాబాద్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తక్షణ రక్షణ చర్యలు చేపట్టడానికి హైడ్రా బృందాలు బుధవారం సికింద్రాబాద్ సర్కిల్‌కు చేరుకున్నాయి. వివిధ డివిజన్లకు చేరుకున్న హైడ్రా బృందాల సభ్యులు ఆయా డివిజన్ల ఇంజనీరింగ్ అధికారులను కలిశారు. భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో అత్యవసర చర్యలు చేసట్టేందుకు అవసరమైన హైడ్రా వాహనాలు కూడా ఇక్కడికి చేరుకున్నాయి. వరద ఉధృతి పెరుగడం, నాలాలు పొంగి జనవాసాలు ముంపునకు గురవడం, రహదారులపై చెట్లు నేలకొరగడం తదితర సందర్భాల్లో తక్షణ మరమ్మతు చర్యల కోసం వాహనాలతోపాటు అవసరమైన సిబ్బంది, పనిముట్లను హైడ్రా వాహనాల్లో అధికారులు అందుబాటులో ఉంచారు.

ఇద్దరు పర్యవేక్షకులు..

ఒక్కో డివిజన్‌కు వరద సహాయక బృందాల నిర్వహణ కోసం ఇద్దరు పర్యవేక్షకులను నియమించారు. ఇద్దరు పర్యవేక్షకుల్లో ఒకరు డే, ఇంకొకరు నైట్ డ్యూటీలో ఉంటారు. డివిజన్‌కు ఇద్దరు పర్యవేక్షకుల నేతృత్వంలో వాహనం, డ్రైవర్, ఇతర సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. జూలై, ఆగస్టు నెలాఖరు వరకు వీరు అందుబాటులో ఉంటారు.

హైడ్రా, జీహెచ్‌ఎంసీ సమన్వయకర్తలు

డివిజన్	అధికారి	ఫోన్ నెంబర్
అడ్డగుట్ట	ఆశిష్‌తివారి	9441255 631
తార్నాక	సీహెచ్.వేణు	7331151747
మెట్టుగూడ	సదజా	9515884132
సీతాఫల్‌మండి	ఎస్.కౌశిక్	7995009108
బౌద్ధనగర్	లావణ్య	8688099515



సీతాఫల్‌మండి రహదారిపై వరదనీటి తొలగింపు చర్యలు చేపట్టిన హైడ్రా అత్యవసర సిబ్బంది

సమన్వయంతో 24 గంటల సేవలు

అత్యవర వాహనాలు, అవసరమైన సిబ్బంది, పనిముట్లను హైడ్రా అందుబాటులోకి తెచ్చింది. రెండు రోజుల్లో జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారుల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించి, మరిన్ని కసరత్తులు చేసి ఐదు డివిజన్లలో వాహనాలను అందుబాటులో ఉండుతాం. ఇందుకోసం హైడ్రా బృందాలకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులను సమన్వయం చేశాం. వరదనీటి నిల్వలు, ట్రాఫిక్ సమస్యలు, వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరుగడం వంటి సందర్భాల్లో ఆయా ప్రాంతాల ప్రజలు డివిజన్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించాలి. – ఎస్.రవికిరణ్, జోనల్ కమిషనర్

బోర్డు నిధులతో అభివృద్ధి పనులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు రెండవ వార్డు రసూల్‌పురాలోని పలు బస్తీల్లో కంటోన్మెంట్ బోర్డు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ తెలిపారు. బోర్డు నిధులు 30 లక్షల రూపాయల వ్యయంతో రసూల్‌పురా చర్చి గల్లీలో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు, రసూల్ పురా నుండి హాకి మైదానం వరకు చేపట్టే అభివృద్ధి పనులను నియోజకవర్గ ఎమ్మెల్యేతో కలసి నర్మద బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసూల్‌పురా బస్తీలో బోర్డు నిధులతో పాటు ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో మౌళికసదుపాయల కల్పనలో భాగంగా పలు అభివృద్ధి పనులు దశలవారీగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. వర్షకాలం అనంతరం రహదారుల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్య క్షులు సదా కేశవరెడ్డి, బీజేపీ వార్డు అధ్యక్షులు శ్రవణ్ కుమార్, అశోక్, స్థానిక నాయకులు మాదారపు ఆశోక్, కాంగ్రెస్ నాయకులు సాంసన్ రాజు, షేక్ నయీం శ్రీహరి, వినోద్, అంజనేయులు, శ్రీనివాస్, నరేష్, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌తో ప్రజల అవస్థలు

- రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



బోయిగూడ, బన్సీలాల్‌పేట్ రోడ్డులో అక్రమ పార్కింగ్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ ప్రాంతంలో అక్రమ పార్కింగ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకైన రోడ్డు దానికి తోడు ఇరువైపులా భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌తో వాహనచోదకులు ఇక్కట్లకు లోనవుతున్నారు. బోయిగూడ రైల్వే బ్రిడ్జి నుంచి ముదిరాజ్ సంఘం బీజేఆర్ నగర్ మీదుగా బన్సీలాల్ పేట్ కమాన్ ఆర్బీ రోడ్డుకు వెళ్లాలంటే ట్రాఫిక్‌లో చుక్కలు చూస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ కన్నెత్తి చూడటం లేదు. ప్రధాన రహదారులపై ఉన్న శ్రద్ధ అంతర్గత రోడ్లపై ఉండటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం అక్రమ పార్కింగ్‌ను తొలగించడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గతంలో అస్తవ్యస్తంగా గుంతమయంగా ఉన్న ఈ రహదారిని వీడీసీసీ రోడ్డు నిర్మాణంతో అందంగా తీర్చిదిద్దారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేకంగా చొరవతీసుకొని ఈ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. లక్షలాది రూపాయల వ్యయంతో ప్రజల సౌకర్యార్థం వేసిన ఈ రహదారి ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ పార్కింగ్‌కు నిలయంగా తయారైయింది. వారం, నెలలు, సంవత్సరాల తరబడి రోడ్డు వాహనాల పార్కింగ్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడేకరువయ్యారనేది వాస్తవం.ఈ రోడ్డులో గాంధీనగర్ పోలీసు స్టేషన్, నర్సింగ్ విద్యార్థినుల హాస్టల్, బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, ముదిరాజ్ కళ్యాణమండపాలు ఉన్నాయి. ఆయా పనులు, వివాహాది శుభకార్యాల కోసం నిత్యం అనేక మంది ఇక్కడికి వస్తుంటారు.

మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేత



మంత్రికి వినతి పత్రం అందచేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్ట్స్ కాలేజీలో జరిగిన జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రాలు అందచేశారు. ఓయూలో 250 అధ్యాపక పోస్టులు మాత్రమే కాకుండా ఖాళీగా అన్ని టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, పరిశోధన విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందచేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులను విడుదల చేయాలని, ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధుల విడుదల కోసం సహకారం ఇవ్వాలని కోరినట్లు దళిత బహుజన, వామపక్ష, ఆర్‌ఎస్‌ఏ, తెలంగాణ విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.

వర్షాకాలం.. అధికారులకు అప్రమత్తత అవసరం

చిలకలగూడ: వర్షాకాలంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సూచించారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో రూ.67 లక్షల నిధులతో పలు అభివృద్ధి నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మారిన వాతావరణ పరిస్థితుల నేపద్యంలో విషజ్వరాలు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చిలకలగూడ వెంకటేశ్వరనగర్‌లో రూ.25 లక్షలు, మార్కండేయనగర్‌లో రూ. 28 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు,రూ.14 లక్షల వ్యయంతో సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు మరమ్మత్తు పనులను ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, అధికారులు స్వర్ణలత, కౌశిక్‌లతోపాటు బీఆర్‌ఎస్ మహిళా వింగ్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మార్కండేయనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అమ్మవారికి బంగారు బోనం సమర్పణ

అమీర్‌పేట: కల్యాణ వేడుకల్లో చివరి రోజైన బుధవారం ఉదయం బల్కంపేట ఎల్లమ్మకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పాతబస్తీ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించారు. 500 మంది వివిధ దేవాలయాలకు చెందిన కమిటీ ప్రతినిధులు కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు.



బంగారు బోనం సమర్పిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు

లాలాపేట: తార్నాక డివిజన్ వినోభానగర్‌లోని ఎస్సీలకు చెందిన స్మశాన వాటిక అభివృద్ధి పనులను కొందరు అడ్డుకుంటున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం, మాల మహానాడు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం ఆ స్థలం వద్ద కబ్జాదారులకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మధు, బండి మహేశ్, నవీన్ మాల, రాఘవేందర్,అమర్ తదితరులున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాల సంఘం నాయకులు

ప్రశాంతంగా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం ప్రశాంతంగా జరిగిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆలయంలో ఆయన క్యూలైన్‌లో నిలుచున్న భక్తులతో మాట్లాడారు. అధికారుల సహకారంతో ఉత్సవాలు విజయవంతమయ్యాయన్నారు. మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్,ఈఓ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న డా. లక్కరాజు నిర్మల

లాలాపేట: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదనీ ఆత్మీయ మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ లక్కరాజు నిర్మల అన్నారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణం పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. డాక్టర్ వెంకట్, నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సులేమాన్‌ఖాన్

చిలకలగూడ: చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు.ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి ఉప్పరిబస్తీకి చెందిన ఆసీఫ్‌ఖాన్ భవనాలకు టైల్స్ వేసే పనిచేస్తుంటాడు. రాజస్థాన్‌కు చెందిన సులేమాన్ ఖాన్ (35) ఆసీఫ్‌ఖాన్ వద్ద ఏడు నెలలుగా పనిచేస్తున్నాడు. గతనెల 30న సాయంత్రం 6.30 గంటలకు టీ తాగి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆసీఫ్‌ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముగిసిన విద్యుత్ వారోత్సవాలు

పద్మారావునగర్: సికింద్రాబాద్ విద్యుత్తు డీఈ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విద్యుత్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ సికింద్రాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గోపయ్య, డీఈ బ్రహ్మానందం, టెక్నికల్ డీఈ వెంకటచారీ, ఏడీఈలు మహేష్‌కుమార్, శివ దుర్గాప్రసాద్, ఆదినారాయణ, ఆయా సెక్షన్ మేనేజర్లు రవికుమార్, క్రిష్ణ, శివరామక్రిష్ణ, వరలక్ష్మీ, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, విల్మా, ప్రతిభా భారతి, యూనియన్ నాయకులు మల్లేశం, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ గోపయ్య మాట్లాడుతూ విద్యుత్తు ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ గోపయ్య

మహంకాళి జాతరకు ఇబ్బందులు లేకుండా చూడాలి

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. దేవాలయ ప్రాంగణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించనున్న పోచంపల్లి పట్టు వస్త్రాలను మగ్గంపై తయారు చేసే పనులను తలసాని బుధవారం ప్రారంభించారు. ఈ నెల 13,14వ తేదీల్లో జరిగే బోనాల జాతరలో అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని ప్రతి భక్తుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవో గుత్తా మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈఎస్ఐసీ వైద్యులకు సన్మానం

సనత్‌నగర్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సనత్‌నగర్‌కు చెందిన శ్రీమాతా సేవా సమితి ఆధ్వర్యంలో ఈఎస్ఐ మెడికల్ కళాశాల, జనరల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు శోభారాణి, కమల, రాధిక, శ్రీదేవి, ప్రవళిక, గోనె శ్రీనివాస్, ప్రభాకర్, శోభ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భక్తుల్లా వచ్చి చోరీలు చేశారు

కల్యాణోత్సవంలో రెచ్చిపోయిన దొంగలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. భక్తుల తరహాలో జనాల్లోకి ప్రవేశించి అందిన కాడికి దోచుకున్నారు. క్యూలైన్లు, ప్రవేశ ద్వారం వద్ద భక్తులను టార్గెట్ చేసి విలువైన సెల్ ఫోన్లు, నగదు, బంగారు ఆభరణాలను అపహరించారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ న్యూబోయిగూడకు చెందిన వరలక్ష్మి, తూర్పు గోదావరి జిల్లా రాజు వద్ద సెల్ ఫోన్లు, మేడ్చల్ నివాసి శ్వేత బ్యాగులోని సెల్ ఫోన్‌తో పాటు రూ.4 వేల నగదు, బహదూర్ పల్లికి చెందిన కవిత వద్ద ఖరీదైన సెల్, బాలానగర్ నివాసి బి.సంధ్య, అంబర్‌పేటకు చెందిన కళావతి, ఫతేనగర్‌కు చెందిన ర్యాపిడో డ్రైవర్ కె.వెంకట్‌రెడ్డి, మల్కాజిగిరి చెందిన గృహిణి సుగుణ, మాధవి, ఎల్బీనగర్ నివాసి బి.ప్రేమలత, బాలానగర్‌కు చెందిన జి.సాహితిల సెల్ ఫోన్లు పోయాయి. మల్కాజిగిరికి చెందిన ఆర్.జోష్న వద్ద పర్సు మాయమైంది. క్యూలైన్‌లో ఉన్న లింగంపల్లికి చెందిన వృద్ధురాలు భారతిబాయి 18 గ్రాముల బంగారు చైన్, సెల్ ఫోన్ ,భోజనం చేస్తుండగా సికింద్రాబాద్ నివాసి ఎస్.రాజేష్ పర్సు కొట్టేశారు. అమీన్‌పూర్‌కు చెందిన గంగాధర్, విజయ వృద్ధ దంపతుల వద్ద 3.2 గ్రాముల మంగళ సూత్రాన్ని అపహరించారు. జగద్గిరిగుట్టకు గాజుల వ్యాపారి వీరమణి మెడలోని 3.5 గ్రాములు బంగారు గొలుసు, క్యూలైన్‌లో సరూర్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ మెడలోని 3.5 గ్రాముల బంగారు ఆభరణాలు, నాగోల్ నివాసి రమాదేవి వద్ద రూ.1500 నగదుతో పాటు ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్డు, రాజేంద్రనగర్‌కు చెందిన విజయ మెడలోని బంగారు గుండ్ల హారం కాజేశారు.పిక్ పాకెటింగ్ గ్యాంగులు చెలరేగిపోవడంతో భక్తులు ఆభరణాలు,డబ్బు,ఇతర వస్తువులు పోగొట్టుకున్నారు.బాధితుల ఫిర్యాదుతో మొత్తం 19 కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.